## అనుబంధం

# బాలగోపాల్ స్పందన

21.2.1997

కె.వి.రమణారెడ్డిగారికి

నమస్తే...మీ ఆరోగ్యం బాగుందా?

మీ ఉత్తరం చదివి నేను మొదట ఆశ్చర్యపోయాను. ఎందుకంటే మీరు నా గురించి ఏదో అన్నట్టు పత్రికలలో వచ్చిన సంగతి నాకు తెలీదు. ఆ తరువాత అడిగి తెలుసుకున్నాను.

నన్ను కమ్యూనిస్టు వ్యతిరేకి అన్నా, మార్క్సిస్టు వ్యతిరేకి అన్నా నాకు చింతా లేదు, సంతోషమూ లేదు. మీరు అనకపోయినా విరసం సభ్యులు చాలామంది అనుకుంటున్నారు. పరవాలేదు. 'మా పక్షాన లేని వాళ్లంతా మా శత్రువులే' అనే తాత్విక వైఖరి ఉన్నవాళ్లకు మూడవ అభిప్రాయం ఒకటి ఉండగలదన్న ఆలోచన సాధ్యం కాదు కాబట్టి వాళ్ల అభిప్రాయాల గురించి బాధపడడం అనవసరం.

నేను పార్లమెంటరీ డెమోక్రసీనీ, పెట్టుబడిదారీ వ్యవస్థనూ సమర్థిస్తున్నానని మీరన్నారని మాత్రం విరసం సభలకు హాజరయిన వారొకరు అన్నారు. నాకు పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే అసహ్యం. దానిని మానవ జాతి ఏ విధంగా అధిగమిస్తుందో ఎవ్వరికీ తెలీదని నేను అనుకుంటున్నాను. మార్క్సిజం పెట్టుబడిదారీ వ్యవస్థను విమర్శించడానికి పనికి వచ్చినంతగా దానిని అధిగమించడానికి పనికిరాదని ఈ శతాబ్దం చరిత్ర రుజువు చేసిందని నా అభిప్రాయం. అది ఏ విధంగా జరగగలదో అర్థం చేసుకోవడానికి మూలాల నుండి పునరాలోచించాలని నేను అనుకుంటున్నాను. దీనికి జవాబు దొరుకుతుందని హామీ ఏమీ లేదు. అయినప్పటికీ అన్వేషణ జరపవలసిందే. పెట్టుబడిదారీ వ్యవస్థతో సరిపెట్టుకోవడం అంటే మానవ జీవితాన్ని

అనైతిక స్థాయిలో ఉంచివేయడమే. మనుషుల మధ్య 'ఉపయోగం' అనేది తప్ప వేరే విలువలేవీ లేని జీవితంతో సరిపెట్టుకోవడమే. ఇది తగదని నా అభిప్రాయం.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విషయం వేరు. అందులోని ప్రాతినిధ్య పాలన అనే సూత్రం చాలా విలువైనదనీ, దానంతటదే 'బూర్జువా' లక్షణం కాదనీ నేను నమ్ముతున్నాను. దానిని మెరుగుపరచుకోవడంలోనే భవిష్యత్తు ఉంది తప్ప తిరస్కరించడంలో లేదని నేను నమ్ముతున్నాను. 'కార్మిక నియంతృత్వం' అనేది కూడ నిజంగా కార్మికుల పాలన కావాలంటే కనీసం కార్మికులయినా ఓటువేసి ఆ ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఉండాలి. కాకపోతే, ప్రాదేశిక నియోజకవర్గాల బదులు ఉత్పత్తి చేసే స్థలాన్ని బట్టి లేదా ఉత్పత్తి రంగాన్ని బట్టి నియోజకవర్గాలు ఏర్పాటు చేయవచ్చు. అయినా అటువంటి రాజకీయ వ్యవస్థకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లక్షణాలు చాలా ఉంటాయి. ఓటుహక్కు ఇచ్చిన తరువాత ఒక పార్టీకి మాత్రమే ఓటు వేయాలనడంలో అర్థం లేదు. అంటే అది ఏదో ఒక రూపంలో బహుళ పార్టీ వ్యవస్థ కావాలి. కమ్యూనిస్టు పార్టీయేకాక ఇతర పార్టీలకు కూడ ఉనికిలో ఉండే హక్కు ఉండాలి. కమ్యూనిజం నిజంగానే కార్మికులు అధికంగా ఆశించే లక్ష్యం అయినట్టయితే ఆ బహుళ పార్టీ వ్యవస్థ కమ్యూనిజానికి భిన్నంగా పోకుండా ఉంటుంది. కానీ కార్మికుల మీద కమ్యూనిస్టులకు ఆ నమ్మకం లేదు కాబట్టే కమ్యూనిస్టేతర పార్టీల ఉనికే లేకుండా చేసారు! ఒక్క పార్టీయే ఉండాలనుకున్నప్పుడు ఓటు హక్కు ఇచ్చి ఏం ప్రయోజనం? కాబట్టి అది కూడ లేకుండ పార్టీ నియంతృత్వం నెలకొల్పారు. బహుళపార్టీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పి, కమ్యూనిజం పట్ల బలమైన సామాజిక కాంక్షను నిత్యకృషి ద్వారా నిలబెట్టగలిగితేనే సోషలిజం సాధ్యం అవుతుంది. అంతే తప్ప స్టాలినిజం తప్పు గానీ కార్మిక నియంతృత్వం రైటే ననడంలో అర్థం లేదని నా అభిప్రాయం.

ఉంటాను.

మీ
బాలగోపాల్

V